# ఓడ - బండి

"నా తల్లిదండ్రులను, ముక్కుపచ్చలారని నా ముద్దు చెల్లెల్నీ అతిక్రూరంగా అమానుషంగా దారుణంగా హింసించి చంపిన ఆ కిరాతకుల అంతం చూసేదాకా నిద్రపోను. ఆ దుర్మార్గుల నెత్తుటితో నావారి ఆత్మలకు రక్తతర్పణం చేస్తాను. ఇదే నా ప్రతిజ్ఞ."

ఒకసారి, రెండోసారి, మూడోసారి కూడా ఆ ప్రముఖ నటుడు పై మాటలు సరిగ్గా చెప్పలేకపోతున్నాడు.

పై నుంచి పక్కల నుంచి లైట్ల కాంతి వేడిగా పడుతున్నది.

ఎండాకాలం ముగింపుకు రాబోతున్నది. మొన్నా అటుమొన్నా రెండు సార్లు సన్నని జల్లు పడ్డాయి. ఆ కారణంగా భూమిలోని వేడిమి అంతా ఆవిరిగా పైకి ఉబికి తపన పుట్టిస్తున్నది.

సహాయరాజు 'ఉస్సు' రని నిట్టూర్చి ఇవతలికి వచ్చాడు. అతనికి అంతలో బీడీ కాల్చాలనిపించింది. అక్కడే చెట్టు క్రింద తిష్ఠవేసుకుని కూర్చున్న వేలాయుధం దగ్గరికి వెళ్ళి ఒకబీడీ యివ్వు బ్రదర్' అని అడిగాడు. వేలాయుధం నవ్వుతూ జేబులో నుంచి బీడీకట్ట తీసి అందిస్తూ 'ఆ డైలాగ్ ఇంకా కాలేదా?' అన్నాడు.

సహాయరాజు ఏమీమాట్లాడకుండా ఒకబీడీ తీసుకుని వెలిగించుకున్నాడు. ఆ క్షణంలోనే అక్కడికి వచ్చిన శివశంకరం పళ్ళన్నీ కనిపించేలా నవ్వుతూ "ఇంక పదిజన్మలెత్తినా వాడా డైలాగు సరిగ్గా చెప్పలేడు. వాడి నాలికమందం..." అన్నాడు నెమ్మదిగా.

సహాయరాజు దయ్యం మేకప్‌లో ఉన్నాడు. జీబురుతలా, వొంటి మీద అస్థిపంజరం ఆకారంలో బిగుతుగా దుస్తులూ, తలమీద రెండు కొమ్ములూ, ఇదీ అతని వాలకం... అతను యిలా మేకప్ అయి దాదాపు రెండు గంటలవుతున్నది. వొళ్ళంతా, తలంతా చెమటపట్టి మహా చిరాకుగా వుంది. పొద్దున ఎప్పుడో మెస్‌లో ఆదరాబాదరాగా తిన్న రెండు ఇడ్లీలు ఎప్పుడో అరిగిపోయాయి. మళ్ళీ ఇప్పుడు ఆకలి తీవ్రంగా వేస్తున్నది. అతడు చిటపటలాడుతున్న బీడీని ఆఖరి దమ్ములాగి అవతల పారేశాడు. నోరంతా అరుచిగా అసహ్యంగా తయారైంది.

మరో నిముషంలో ఆ చెట్టు కిందికి పెరుమాళ్ళు వచ్చాడు. ఆ కథలో కథానాయకుడు సముద్రంలో కొట్టుకుపోయి, ఎప్పుడో మరోదేశంలో నది ఒడ్డుకు కొట్టుకొస్తే అతన్ని రక్షించి తన యింటికి తీసుకువెళ్ళి పెంచి పెద్దచేసిన ముసలివాడి పాత్ర అతనిది. ఇంటర్వెల్‌కు ముందు కథానాయకుడికి అతని తల్లిదండ్రులను చంపిన కిరాతకులను గురించిన వివరాలూ, నదిలో కొట్టుకు వచ్చినప్పుడు అతని మెడలో ఉండిన లాకెట్టూ అప్పజెప్పి పగతీర్చుకోమని చెప్పి కన్నుమూస్తాడు.

ఇందాక అతను ఒక కుక్కిమంచంలో పడివుండి చాలాసేపు మరణం డైలాగులు చెప్పవలసి వచ్చింది.

పెరుమాళ్ళు వస్తూనే సహాయరాజు పక్కన గడ్డిమీద బాసిపట్టు వేసుకుని కూర్చుని, మెడలో నుంచి నశ్యండబ్బీ తీసి పెద్దపట్టుచేతిలో వేసుకుని, పాపం గంట సేపటినుంచి పొడుంపట్టులేక బాధపడుతున్నాడో ఏమో, పెద్ద చప్పుడు చేస్తూ ముక్కురంధ్రాలలోకి దట్టించి గొప్ప ఆనందం అనుభవిస్తున్న వాడిలా కళ్ళు అరమోడ్పులు చేసి, చివరకు కదలకుండా కూర్చుండి పోయాడు. అతనికి ఆ పాత్రకు డబ్బు బాగానే ముట్టింది.

అంతలో శివశంకరం పెరుమాళ్ళు దగ్గరగా జరిగి కుడిచెయ్యి ముందుకు చాపి వుంచి “ఊ! నిన్న నాలుగు ముక్కలు చెప్పి మిగతాది వాయిదా వేసి వెళ్ళిపోయావు. ఇప్పుడు చూడు...” అన్నాడు.

పెరుమాళ్లు కళ్ళు తెరిచి మూలుగుతున్నట్టు “ఊం...” అన్నాడు ముందు. ఆ తర్వాత అతని చెయ్యి అందుకుని చాలా శ్రద్ధగా చూస్తూ మాటి మాటికీ తలపంకిస్తూ ఉండి ఉండి ఏదో చదివిన వాడిలా కూని రాగం తీస్తూ కొన్ని క్షణాలు గడిపి ఆ తర్వాత “నీ చిన్నప్పుడు పెద్ద గండంతప్పి వుండాలి” అన్నాడు.

శివశంకరం ఏదో గుర్తుకు తెచ్చుకుని “నిజమే...అనుకుంటాను. మా అమ్మమ్మ చెబుతూ వుండేది. గోదావరి పుష్కరాలకు పోతే స్నానం చేస్తూ నీళ్ళలో కొట్టుకుపోయానుట. ఎవడో సాహసించి ఈదుకువచ్చి నన్ను ఒడ్డుకు లాక్కుపోయి రక్షించాట్ట” అన్నాడు.

“చూశారా” అన్నట్టు పెరుమాళ్లు అందరి వంకా గర్వంగా చూశాడు. ఆ తర్వాత “నీకు పెళ్ళికాలేదు కదూ?” అని అడిగాడు.

“కాలేదు” అన్నాడు శివశంకరం.

“అవుతుంది... ఇంకా రెండు మూడేళ్ళు వ్యవధివుంది. ఈ లోపల జీవితంలో సెటిలయిపోతావు. ఇంకా ముందంతా మంచే జరుగుతుంది.”

“ఇంకా... ఇంకా చూడు... కాస్తఫీల్డులో నిలదొక్కుకుంటానా? సొంత యిల్లూ అదీ”

“అవన్నీ జరుగుతాయి. నిక్షేపంగా ఉంటావు.”

“పిల్లలు...” అన్నారెవరో.

పెరుమాళ్ళు మళ్ళీ అతని చెయ్యిపట్టుకుని “ఒకటీ, రెండూ, మూడూ, నాలుగూ” అంటూ వుండగా వేలాయుధం” ఇక చాలయ్యా బాబూ! అసలే కరువురోజులు అన్నాడు.

“రాసి పెట్టివుంటే - తప్పేదేముంది? నాకు లేరూ ఎనిమిదిమంది సంతానం? మన వశంలో ఏదీ లేదు. అంతా విధిలిఖితం” అన్నాడు పెరుమాళ్ళు.

“అప్పుడు శివశంకరం యిల్లు బాలనాగమ్మ కథలో కమెడియన్ యిల్లులా పిల్లదయ్యాలతో నిండి భయంకరంగా తయారవుతుంది. అది గొప్పడేంజర్” అన్నాడు వేలాయుధం.

అంతలో లోపలినుంచి“వేలూ!వేలూ!రా, అర్జంటు” అని పిలుపు వినవచ్చింది. లోపల ఏదో చిన్న హాస్యసన్నివేశం చిత్రించబోతున్నారు. వేలాయుధంలేచి “వస్తానప్పా” అంటూ విసవిస నడిచి వెళ్ళిపోయాడు. అతను చాలా చిన్నసైజు హాస్యనటుడు.

సాధారణంగా నవ్వడు. ఎక్కువ మాట్లాడడు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నవాడిలా మౌనంగా ముభావంగా ఉంటాడు. నిరంతరం బీడీ నోట్లో ఉండవలసిందే.

అతడు వెళ్ళిపోగానే పెరుమాళ్ళు పైపంచెతో మొహం తుడుచుకుని నిట్టూర్చి "అబ్బబ్బ! ఇంత ఉక్కపోస్తున్నదే. యివాళ గాలే లేదు" అన్నాడు.

అంతలో కాకీబట్టలు వేసుకున్నవాడొకడు వచ్చి "సహాయరాజంటే ఎవరప్పా?"అని అడిగాడు.

సహాయరాజు వెనుదిరిగి "ఏం? ఎందుకు" అని అడిగాడు.

"అది తర్వాత. ముందు వాడెవరో చెప్పు సామీ"

"నేనే"

"ఓహో! అట్లా చెప్పరాదూ? నీకోసం ఒక ఆడుకూతురు వెయిట్‌చేస్తావుంది...రా."

పెరుమాళ్ళు అదివిని ఒకరకంగా వక్రంగా నవ్వుతూ 'వెళ్ళిరా' అన్నాడు.

సహాయరాజు లేచి గబగబ అడుగులు వేశాడు. గేటు పక్కన చిన్నగదిలో అనంత లక్ష్మి కూర్చుని వుంది. ఆమె సహాయరాజును చూడగానే చివాలునలేచి ముందుకు అడుగువేసి "బుజ్జికి ఏమీ బాగులేదు. ఎగశ్వాసగా వుంది. ఊరికే రొప్పుతున్నది. డాక్టరు దగ్గరికి తీసుకుపొమ్మన్నది తాయారుమామి" అన్నది. ఆమె కళ్ళు అంతలోనే నీటిపొరతో తళతళ లాడాయి.

"తీసుకువెళ్ళు... దానికోసం ఇక్కడికి రావడం దేనికి?" అన్నాడు సహాయరాజు కనుబొమ్మలు ముడిచి.

అనంతలక్ష్మి గొంతు సర్ధుకుని తగ్గుస్వరంతో ఏదో గొణిగింది. సహాయరాజు 'అలాగా' అనుకుని "ఇప్పుడే వస్తానాగు" అంటూ యివతలికి వచ్చాడు. మేకప్‌రూంలో భద్రపరచిన తన ప్యాంట్ జేబులు వెదికితే పదిరూపాయిలే వున్నాయి. అవి చేతిలో వుంచుకుని ఇవతలికి వచ్చి అటూయిటూ చూశాడు. చెట్టుక్రింద పెరుమాళ్ళు కాలుమీద కాలు వేసుకుని గడ్డిలోవాలి పడుకుని కూనిరాగం తీస్తున్నాడు. సహాయరాజు అతని దగ్గరికి వెళ్ళి సంకోచిస్తూనే "మీ దగ్గర ఒక యిరవైరూపాయిలున్నాయా? మళ్ళీ సాయంత్రం పేమెంట్‌కాగానే యిచ్చేస్తాను" అని అడిగాడు.

పెరుమాళ్ళు ఓరకంటితో అదొకరకంగా చూస్తూ వక్రంగా నవ్వుతూ తల అడ్డంగా ఊపి కూనిరాగం కొనసాగించాడు.

సహాయ రాజు మనస్సు చివుక్కుమన్నది. 'ఎందుకడిగినా?' అని విలవిల లాడిపోయాడు.

అంతలో వేలాయుధం ఇవతలికి వచ్చాడు. లోపల ఆ చిన్న హాస్యసన్నివేశం అయిపోయినట్టున్నది. "ఇంతసేపూ యిన్ని పిచ్చి మాటలు ఎలా మాట్లాడానా? అని బాధపడుతున్న వాడిలా తూలుతూ అడుగులు వేస్తూవస్తున్నాడు.

సహాయరాజు అతని ఎదురుగావెళ్ళి "బ్రదర్! ఒక ఇరవైరూపాయలుంటే ఇవ్వు. సాయంకాలం ఇచ్చేస్తాను" అని అడిగాడు.

వేలాయుధం "ఎంతవుందోమరి" అంటూ లోపల బనీనుజేబులు వెదికి "అదృష్టమే, ఉంది. ఇదుగో తీసుకో" అంటూ యిరవైరూపాయలు సహాయరాజుకు అందించాడు. అందించి తమాషా గొంతుకతో "నిన్నంతా తిండి మానేశాను. టోటల్ ఫాస్టింగ్...మొన్నంతా

విరేచనాలయినాయి... ఫాస్టింగ్‌తో సర్దుకుంది. అందుకే మిగిలిందీ సొమ్ము" అన్నాడు నవ్వుతూ.

సహాయరాజు ఆ డబ్బు తీసుకుని అనంత లక్ష్మి దగ్గరికి వచ్చాడు. "ఇదుగో... బుజ్జిని మంచి డాక్టరు దగ్గరకే తీసుకువెళ్ళు. అన్నట్టు పిల్లదగ్గర ఎవరున్నారు?"

"తాయారుమామి ఉంది" అన్నది అనంతలక్ష్మి. తర్వాత ఆ డబ్బు అందుకుని ఆమె దాదాపు పరుగెడుతున్నట్టు గేటులో నుంచి బైటికి వెళ్ళిపోయింది. సహాయరాజు నీరసంగా నడుస్తూ మళ్ళీ చెట్టుకిందికి వచ్చాడు. అప్పటికీ పెరుమాళ్ళు చుట్టూ వేలాయుధంతో సహా ఒక అరడజను మంది కూర్చుని వున్నారు.

సహాయరాజు కనిపించగానే పెరుమాళ్లు "ఏమప్పా? పని అయిందా? ఎవరా ఆడకూతురు? అని అడిగాడు నవ్వుతూ.

సహాయరాజు ఏమీ మాట్లాడకుండా కొన్ని క్షణాలు కూర్చుని తర్వాత ఉన్నట్టుండి తన కుడిచేయి ముందుకు చాపి "నా చెయ్యి చూడండి..." అని అడిగాడు.

పెరుమాళ్ళు సర్దుకుని కూర్చుంటూ "చూస్తాను...చూస్తాను...కాని లక్ష్మిలేనిదే వాక్కు పలకదే. అది జ్యోతిషానికి పార్వతీదేవి శాపం...ఒక రూపాయి పెట్టు అక్కడ..." అన్నాడు.

సహాయరాజు ఒకరూపాయి నాణెంతీసి పెరుమాళ్ళుకు అందించాడు. దాన్ని అందుకుని పెరుమాళ్ళు నడుమున దోపుకుని "ఊం" అని మూలుగుతూ సహాయరాజు చెయ్యిపట్టుకుని పరిశీలనగా చూస్తూ కొన్ని క్షణాలు గడిపాడు. తర్వాత ఏవేవో చెప్పడం ప్రారంభించాడు. కొన్నింటిని సహాయరాజు 'ఔనన్నాడు. కొన్నింటిని 'కాద' న్నాడు.

"నీ జీవితంలో ఒకస్త్రీ ప్రవేశించింది. కొద్దికాలం క్రిందట..."

"అవును"

పెరుమాళ్ళు గర్వంగా నవ్వాడు. చుట్టూ అందరివంకా చూశాడు.

"ఇంకా చెప్పేందుకేముంది? మరి... సంతానం సంగతి..." అంటూ వుండగా సహాయరాజు చేతిని లాక్కుని" ఇంకేమీ చెప్పనక్కరలేదు" అన్నాడు.

"ఏమప్పా? పూర్తిగా చెప్పనివ్వవు...సిగ్గెందుకు?" అని నవ్వాడు పెరుమాళ్లు.

సహాయరాజు తర్వాత నిశ్శబ్దంగా కూర్చుండిపోయాడు. పైన చెట్టుమీద ఏదో పక్షి కూర్చుని అరుస్తునది. దూరంగా ఆకాశంలో తెల్లని మబ్బు ఒకటి నెమ్మదిగా కదులుతున్నది.

అంతలో ఒక కొత్తకారు ఆవరణలోకి వేగంగా దూసుకువచ్చి ఆగింది. నిర్మాతలూ, దర్శకులూ, రచయితా వగైరాలందరూ హడావిడిగా పరుగెత్తుకుంటూ ఎదురు వెళ్లారు.హీరోయిన్ వచ్చింది. కొత్త అలజడి ప్రారంభమైంది. లోపల కేకలు... కోలాహలం... పాట ఒకటి రణగొణ ధ్వనిగా మ్రోగడం మొదలైంది.

సహాయరాజు మళ్ళీ మేకప్ రూంలోకి వెళ్ళి మేకప్ సరిచేయించుకున్నాడు. ఈ లోపల అసలు మేకప్‌మాన్ హీరోయిన్‌ను అందంగా సరిదిద్దాడు.ఆమెలోపలికి వెళ్ళి వేపమండలు అందుకుని పాటకు అనుగుణంగా నర్తించడం ప్రారంభించింది. ముందు నృత్య దర్శకుడు చేసి చూపించడం, తర్వాత హీరోయిన్ నాట్యం చేయడం...ఇదీ వరస...

"నేనే పోలేరమ్మనురా...

నేనే నాంచారమ్మనురా...

నేనే కాళికా శక్తినిరా...రా...రా...రా" అంటూ కథానాయిక దయ్యం వేషంలో ఉన్న సహాయరాజును బాదడం, సహాయరాజు ఎగురుతూ గంతులు వేయడం... ఇలాబయటి ప్రపంచంలో చీకటి పడే వరకూ పాటచిత్రీకరణ కొనసాగింది. మధ్యాహ్నం రెండు గంటల వేళ అందరికీ సాంబారు అన్నం వడ్డించారు. సహాయరాజు మేకప్ తోనే నాలుగు ముద్దలు తిన్నాడు. పాట చిత్రీకరణ జరిగినంతసేపూ గంతులు వేస్తూనే వున్నాడు. వేపమండలతో దెబ్బలు తింటూనే వున్నాడు. రిహార్సల్ పేరుతో కొన్నిసార్లు, షూటింగ్ పేరుతో కొన్నిసార్లు మధ్య మధ్యలో దర్శకుడు హీరోయిన్‌తో "అమ్మణ్ణి! మరింత గట్టిగా కొట్టాలి. ఎఫెక్ట్‌రావాలి" అంటూ వచ్చాడు.

రాత్రి ఎనిమిది గంటల తర్వాత ముందు కథానాయికి "అర్జంటుగా వెళ్ళాలి"అంటూ ఖరీదైన శాలువా కప్పుకుని మేకప్‌తోనే కారులో వెళ్ళిపోయింది.

సహాయరాజు మేకప్‌తీసేసి ముఖం నూనెతో కడుక్కుని వ్యాను దగ్గరికి నడిచాడు. అప్పటికే వేలాయుధం వెనకసీటులో బీడీకాలుస్తూ వొదిగి కూర్చునివున్నాడు. ఆ తర్వాత వారికోసం వీరికోసం చాలాసేపు గడిచిన తర్వాత వ్యాను నెమ్మదిగా ఆఫీసుకి బయలుదేరింది సహాయరాజు చెవులలో పెరుమాళ్ళు మాటలే రింగుమంటూ వినిపిస్తున్నాయి. "నీ జీవితంలో ఒక స్త్రీ ప్రవేశించింది."

అనంతలక్ష్మి...

ఆనాడు... రాత్రి రెండు గంటల వేళ... భయంకరమైనచీకటి...సహాయరాజు పాతిక రూపాయలవేషాల కోసం చెప్పులరిగేలా అందరిచుట్టూ తిరిగే రోజులు... ఆనాడు అతడు నగరంలో మరోమూల ఒక మిత్రుడి యింటికి వెళ్ళి అక్కడ చేరిన నలుగురితోనూ పేకాట ఆడి రూముకు తిరిగి వస్తున్నాడు. సాయంకాలంచేతిలో ఉన్న యిరవై రూపాయిలూ అరవై రూపాయలలై జేబు నిండుగా దండిగా ఉంది. మెయిన్ రోడ్డులమీద తప్ప తక్కిన వీధుల్లో మందమైన వెలుతురు...అదుగో...అప్పుడు అకస్మాత్తుగా ఆకాశంలో నల్లని మబ్బులు గుమిగూడి గర్జించాయి...

కాస్సేపు దుమ్మురేపుతూ ఈదురు గాలి వీచింది... ఉన్నట్టుండి ఇండుప గింజలంత చినుకులతో ఉధృతంగా వర్షం ప్రారంభమైంది... సహాయరాజు తప్ప తడుస్తూనే నడిచాడు. ఆ వీధిలో వెలుతురేలేదు. ఇళ్ళతలుపులన్నీ బిగించి వున్నాయి. తన గది వీధిమీదికే వుంది. చిన్న పెంకులవరండా... వెనక చిన్నగది... అతను కొద్ది గజాల దూరంలోనే ఆశ్చర్యంతో కళ్ళు చికిలించి చూశాడు. చెవులు రిక్కించుకునివిన్నాడు.

హృదయ విదారకమైన పసిపిల్ల ఏడుపు...అతడు పొరబడలేదు. తన వరండామూల ఒక పసిపిల్ల వర్షపు జల్లుకు తడుస్తూ ఏడుస్తున్నది. ప్రక్కనే చీకటి మూటకట్టిపడేసినట్టు పడివున్న ఒక స్త్రీ ఆకారం... సహాయరాజు త్వరత్వరగా తలుపుతీసి హరికెన్ లాంతరు

వెలిగించి పక్కకు వెళ్ళి తాయారుమామిని కేకలు పెట్టి పిలిచాడు. ఆమె 'ఏమప్పారాజూ'? అంటూ వచ్చింది. విషయం తెలుసుకుని ఆమెకూడా ఆశ్చర్యపోయింది.

సహాయరాజు ముందు పసిపిల్లను గదిలోదింపి వచ్చాడు. తర్వాత యిద్దరూ కలిసి స్పృహలేని ఆ యువతినీ దాదాపు ఈడ్చుకు వెళ్ళి లోపల చాపమీద పడుకోబెట్టారు. తాయారుమామి జాలిగా 'రాజూ! పాపం ఈమె కండిషన్ ఏమీ బాగులేదు. మంచి కుటుంబం మనిషి లాగున్నది. వెళ్ళి డాక్టరును తీసుకుని రావయ్యా' అన్నది ఆందోళనతో. అతను ఆ వర్షంలోనే తడుస్తూ వెళ్ళి వీధి చివర ఉన్న డాక్టరును బతిమిలాడి తీసుకువచ్చాడు. ఆమె మరునాటికిగాని తేరుకోలేదు. తేరుకున్న తర్వాత ఏడవటం ప్రారంభించింది. తర్వాత చాలాసేపటికి తన గాథ వివరించింది.

చాలా దూరం నుంచి భార్య భర్తలిద్దరూ తిరుపతికి వచ్చారు పసిపిల్లతో సహా. అర్థరాత్రి వేళ ఆ సెకండ్ క్లాస్ కంపార్ట్‌మెంటులో నలుగురు దుండుగులు భర్తను కత్తిచూపి బెదిరించి రైలులో నుంచి దించి వేశారు. ఆ తర్వాత ఆమెను నిర్బంధించి వొంటిమీద ఉన్న ఆభరణాలు దోచుకుని మరో స్టేషను సమీపిస్తుండగా రైల్లోంచి దూకి పొలాలు తుప్పలకు అడ్డంపడి పారిపోయాడు.

ఆ తర్వాత ఆమె భర్త వచ్చాడు. ఆమె ఏడుస్తూ అంతా వివరించి చెప్పింది. తానెలా దొంగలతో పెనుగులాడింది కూడా వివరంగా చెప్పింది. భర్త ఏమనుకున్నాడో ఏమో; పల్లెత్తి పలుకలేదు. నిశ్శబ్దంగా ఉండిపోయాడు. తర్వాత ఉన్నట్టుండి 'మద్రాసుకు పోదాం' అన్నాడు. ఆ తర్వాత ఏదో స్టేషనులో దిగిపోయాడు. తిరిగి రాలేదు. ఆమె చేతుల్లో పసికందుతో కంగారు పడిపోయింది. సెంట్రల్‌లో దిగిన తర్వాత రైలు తర్వాత రైలు కళ్ళలో నత్తులువేసుకుని చూసింది. అతడు రాలేదు. దగ్గర రాగిపైసాకూడా లేదు. పిల్ల అకలితో గుక్క పెట్టి ఏడుస్తున్నది. తర్వాత ఆమె ఏమనుకున్నదో ఏమో నెమ్మదిగా స్టేషనులో నుంచి బయటపడింది.

గేటు దగ్గర 'పిల్లలకు పాలు కావాలి. తెచ్చుకుంటాను' అని చెబితేనమ్మివెళ్ళ నిచ్చారు అంతా కొత్త... ఎక్కడేముందో తెలియదు...భాష బొత్తిగా తెలియదు...ట్రాఫిక్ పలుచబడిపోతున్నది. ఆమె ఇక మొండిగా తోచిన వైపుకు నడువటం ప్రారంభించింది. నీరసం నిస్సత్తువ. మనసులో కలవరం. రకరకాల సమాధానం లేని ప్రశ్నలు. ఏమీ తోచనీయకుండా పిల్లదాని ఏడుపు...అప్పుడు ప్రళయ సదృశంగా ఈ వానమొదలైంది. తూలుతూనే వచ్చి ఈ వరండాలో తలదాచుకుందామని కూలబడబోయింది. కాని అంతలోనే శరీరం తూలిపోయింది. స్పృహతప్పింది. పసిపిల్ల కిందపడి ఏడుస్తున్నా ఆమెకేమీ తెలియలేదు.

ఆ తర్వాత తాయారుమామి సహాయరాజు సహకారంతో ఆమె చెప్పిన చిరునామాకు ఉత్తరం వ్రాయించి ఆ అభాగ్యురాలిని భర్త దగ్గరికి చేరుద్దామని తాపత్రయపడింది. కాని అటువైపు నుంచి ఒక క్రూరమైన అశ్లీలమైన ఉత్తరం తప్ప మరే సమాధానమూరాలేదు. ఇక ఇంత జరిగాక అనంతలక్ష్మి కూడా గుండెరాయి చేసుకున్నది. తనకు తల్లి చిన్నప్పుడే పోయింది. ఇదుగో, ఇలాంటి అనుమానాల పుట్టఅయిన భర్తను కట్టబెట్టి తండ్రి కూడా

కన్నుమూశాడు. ఉన్న ఒక్క తమ్ముడు ఎక్కడో ఒరిస్సాలో నౌకరి చేసుకుంటున్నాడు. తాను మెట్రిక్ చదివింది. పెళ్ళికాక ముందు సరదాగా నేర్చుకున్న టైప్‌విద్య వుంది. ఇక తన కాళ్ళమీద తాను నిలబడి పసిదాన్ని చూసుకుంటూ జీవితం గడపడం ఉత్తమమనే నిర్ణయానికి వచ్చింది.

తాయారుమామి కూడా ఆవేదనతో "ఇంతే నమ్మా! ఈ మగవాళ్ళంతా యింతే" అని అనంతలక్ష్మికి తోడుగా అండగా నిలిచింది. అనంతలక్ష్మి మొన్నటిదాకా ఏదో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ నెలకో రెండొందలు తెస్తూ వుండేది. రెణ్ణెల్ల క్రితమే ఆ కంపెనీ మూతబడ్డాక పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది... ఇదీ అనంతలక్ష్మి వృత్తాంతం.

వ్యాను చప్పుడు చేస్తూ ఆగగానే సహాయరాజు ఆఫీసుముందు దిగాడు. పెరుమాళ్లు మాటలు, అతని వంకరనవ్వు గుర్తుకు వచ్చి సహాయరాజుకు కంపరం కలిగింది. అతడు ఆఫీసు వరండాలోకి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు. వేలాయుధం "అబ్బో! చాలా పొద్దు పోయింది. ఇక ఎక్కడా తిండి దొరకదు. బన్ను తిని టీతాగితే సరి" అంటూ వచ్చి సహాయరాజు పక్కనే కూర్చున్నాడు.

కాస్సేపటిలో వీరిద్దరికి ఆనాటి కృషి ఫలితం కవర్లలో ముట్టింది. సహాయరాజు తన యాభై రూపాయలలోనే కొన్నినోట్లు తీసి వేలాయుధానికి అందించి నవ్వాడు. వేలాయుధం "ఏమప్పా అంత అర్జంటు?" అంటూనే ఆనోట్లు అందుకున్నాడు.

అక్కడి నుంచి మైలున్నర దూరం కాలినడకన యిల్లు చేరుకునే వరకూ సహాయరాజు మనసుకు ఊరటలేదు. ఆ పసిపిల్ల బంగారుబొమ్మ. తమకూ తాయారు మామికే కాక ఆ చుట్టుపక్కల వారికి కూడా ఆపిల్ల అంటే ముద్దు. మూడు నాలుగు రోజుల నుంచీ వొళ్ళు తెలియని జ్వరంతో బాధపడుతున్నది. ఇప్పుడెలాగుందో ఏమో? తలుపుతట్టబోతూ వుండగా సహాయరాజు గుండెలు గుబగుబ లాడాయి.

అనంతలక్ష్మి నవ్వుతూ తలుపుతీసింది. అతడు "బుజ్జికెలాగుంది?" అని అడుగుతూనే పక్కకు చూశాడు. పిల్ల హాయిగా పడుకుని నిద్రపోతున్నది. నిద్రలో నవ్వుతున్నది.

సహాయరాజు మనసు తేలికపడింది. "థాంక్యూ వేలాయుధం మై బ్రదర్" అనుకున్నాడు. అనంతలక్ష్మి డాక్టరు ఏమన్నాడో, ఇంజక్షన్‌కోసం ఎంతదూరం వెళ్ళవలసి వచ్చిందో ఇలాటి వివరాలన్నీ చెబుతూనే వుంది. అతడు వింటూనే చాపమీద వాలిపోయాడు.

"అదేమిటి? తిండితినవూ? వొడ్డిస్తాను. లే" అంటున్న అనంతలక్ష్మికి" నాకు ఓపిక లేదు. నిద్రముంచుకొస్తున్నది. పడుకోని" అని మందంగా సమాధానం వినవచ్చింది. అంతే... అతని కళ్ళు మూతలు పడ్డాయి. క్షణాల్లో వొళ్ళు తెలియని నిద్ర పట్టింది.

మూడేళ్ళ తర్వాత...

సహాయరాజు అదే స్టూడియోలో అదే చెట్టు క్రిందకి వచ్చాడు. శిశిరం కావడంతో ఆకులన్నీ రాలిపోయి ఆచెట్టు గత వైభవాన్ని కోల్పోయి దీనంగా నిలబడివుంది.

సహాయరాజు నల్లలుంగీ, నల్లబనియను, వెడల్పయిన తోలుబెల్టు ధరించి రౌడీవేషంలో వున్నాడు. అంతకు అయిదు నిముషాల ముందే హీరోకొట్టిన దెబ్బకు మెట్లమీది నుంచిపడి క్రిందికి దొర్లుకువచ్చి పడ్డాడు. ఆ చాదస్తపు దర్శకుడు ఎఫెక్ట్ రావాలని గోడవ చేసి రెండుసార్లు రిహార్సల్స్ కూడా చేయించాడు.

ఇప్పుడతని కాలిమడమ నొప్పి పడుతున్నది.

అతనికి అంతలో బీడీ కాల్చాలనిపించింది. ఇప్పుడు దానికోసం ఎవరినో ముష్టెత్తడం దేనికిలే అని కూడా వెంటనే అనిపించింది. అప్పుడే వేలాయుధం గుర్తువచ్చాడు అతని కళ్ళు చెమ్మగిల్లాయి. వేలాయుధం ఇటీవలే చచ్చిపోయాడు. అకస్మాత్తుగా చిలక ఎగిరిపోయింది. రాయలసీమలో ఏదో ఊళ్ళో ఎదిగిన కొడుకు మాత్రం ఉన్నాడు. నిల్వధనంగాని ఆస్తిపాస్తులుగాని ఏమిలేవు.

అడుగో, శివశంకరం నవ్వుతూ వస్తున్నాడు. చిన్నవే అయినా కాస్త గుర్తింపు గల పాత్రలు అతనికి దొరుకుతున్నాయి. తనలాటివారి పనికూడా పరవాలేదు. సినిమాల్లో ఫైటింగులు బాగా పెరిగాయి. లైటింగులకు తనలాటి భారీ మొద్దు మనుషులు కావలసి వచ్చారు. అప్పుడప్పుడు గట్టి దెబ్బలు తగులుతూ వుంటాయి. అయినా కాస్త డబ్బు ఎక్కువే ముట్టజెపుతున్నారు. రోజుకు ఒక్కొక్కప్పుడు వందరూపాయలు కూడా దొరుకుతూ వుంటుంది. నెలలో ఎంతలేదన్నా యిరవై రోజులపాటు పని వుంటుంది.

అనంతలక్ష్మి చక్కని ఉద్యోగంలోనే వున్నది. బుజ్జి అందాలబరిణిగా పెరుగుతున్నది. చదువులో మహాచురుకు. మాటలు వచ్చేకొత్తలో తనను "నాన్నా" అని పిలవబోతే అనంతలక్ష్మి వారించింది. "తప్పు. అలా అనకూడదు. మామా అనాలి" అని చెప్పింది. సహాయరాజు తనలోతనే నవ్వుకున్నాడు. అంతలో శివశంకరమూ, మరోస్టంట్‌మాన్ వచ్చి నిలబడితే వారితో కబుర్లలో పడ్డాడు.

అప్పుడు...

ఒక ఆకారం పక్కనుంచి వారిని సమీపించింది. జీబురుతలా, మాసిన గడ్డం, పీలికలు కావడానికి సిద్ధంగావున్న పంచె... పై కండువా, పాత కళ్ళజోడు, చిట్లిన అద్దాలు, మూర్తీభవించిన దైన్యంలాంటి ఆకారం... ఆ వ్యక్తి సహాయరాజు దగ్గరికి వచ్చి లోగొంతుకతో" చెయ్యి చూస్తాను. కాఫీకి డబ్బు లివ్వచాలు..." అని అడిగాడు.

సహాయరాజు కళ్ళార్పకుండా అతడి వంక చూసి, ఏమనుకున్నాడో ఏమో, జేబులో నుంచి ఒక రూపాయి నాణెంతీసి అతని మీదికి విసిరి "ఇది తీసుకో... కాఫీ త్రాగు. చెయ్యి చూడనక్కరలేదులే..." అన్నాడు. ఆ వ్యక్తి అది అందుకుని మౌనంగా నవ్వి నెమ్మదిగా గేటువైపు నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

(స్వాతి సపరివార పత్రిక - 20 మే, 1986)

◆ ◆ ◆